క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండపేట శాఖ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని జెడ్పీ గరల్స్ ఉన్నత పాఠశాలలో శనివారం రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండపేట శాఖ సమావేశం అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి పెంకే గోవిందరావు, మండపేట పట్టణం, గ్రామాల్లోని రిటైర్డ్ పెన్షనర్లు హాజరయ్యారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్టు అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, గోవిందరావు తెలిపారు.

ద్రాక్షారామలో హుస్సేన్ జిందాబాద్ వాక్



హుస్సేన్ జిందాబాద్ వాక్‌లో పాల్గొన్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: ఇరాక్ దేశంలో నజఫ్ నుంచి కర్బలాకు నిర్వహించే హుస్సేన్ జిందాబాద్ వాక్‌కు సమాంతరంగా శనివారం ద్రాక్షారామ నుంచి హసన్‌బాద వరకు ఈ వాక్‌ను ముస్లింలు నిర్వహించారు. ముస్లిం చిన్నారులు, యువత, పెద్దలు జాతీయ జెండాలు, ఇమామ్ హుస్సేన్, హజ్రత్ అబ్బాస్ జెండాలతో నినాదాలు చేస్తూ హసన్‌బాదలోని ఇమామ్ హసన్ పంజా వరకు హుస్సేన్ జిందాబాద్ వాక్, మాతం ప్రదర్శన నిర్వహించి కర్బలా వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాలు, ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలను ప్రతిఘటించాలి



మండపేటలో మాట్లాడుతున్న పలివెల సుధాకర్

కపిలేశ్వరపురం (మండపేట): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అరాచక కార్యకలాపాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్ ప్రజలను కోరారు. మండపేటలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ కూటమి ప్రజావ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా గళమెత్తిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులపై తప్పుడు ప్రచారం చేయటాన్ని ఆయన ఖండించారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన కూటమి భాగస్వామ్య జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తీరును సుధాకర్ ఖండించారు. అధికారంలో ఉన్నవారు విపక్ష ప్రజాప్రతినిధులు వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ప్రశ్నించేవారిని కించపరుస్తామంటే ప్రజాస్వామ్యంలో ప్రజలు సహించరని సుధాకర్ అన్నారు. సమావేశంలో దళిత నాయకుడు కోనాల చంద్రబోస్ పాల్గొన్నారు.

యల్లాప్రగడకు ఘన నివాళి



మండపేటలో యల్లాప్రగడకు నివాళి అర్పిస్తున్న పీఎంపీలు

కపిలేశ్వరపురం (మండపేట): కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ల (పీఎంపీ) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మండపేటలో భీమవరం వాసి యల్లాప్రగడ సుబ్బారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ యల్లాప్రగడ వైద్యుడిగా, శాస్త్రవేత్తగా విశేష సేవలందించారన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి సత్యనారాయణ, వి.నరేష్ కుమార్, ఎస్.కె బాజి, పిల్లా సతీష్, పి చౌదరి, బొక్కా వీరబాబు, గాలింకి నాగేశ్వరరావు, పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అంగరలోని వైభవవేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూలో నిలుచున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామిని విశేషంగా అలంకరించారు. శ్రావణమాసం, శ్రావణ పౌర్ణమి, శనివారం, శ్రవణా నక్షత్రం ప్రత్యేకతలన్నీ కలబోసి ఒకే రోజున రావడంతో స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సాగునీటి వెతలు తీర్చరా?

- కుచించుకుపోతున్న కోరంగి కాలువ
- 32 వేల ఎకరాలకు సాగునీటి ఇక్కట్లు
- శివారు భూములకు నీరందని పరిస్థితి



చేదువాడ వద్ద మూసుకుపోయిన కోరంగి కాలువ

కాజులూరు: కొంత కాలంగా పంట కాలువలు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో కాలువ శివారు భూముల్లో ఉన్న పొలాలకు సాగు నీరందటం కష్టతరంగా మారింది. ముఖ్యంగా రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో వెల్ల లాకుల నుంచి మంజేరు వరకున్న కోరంగి కాలువ కుచించుకుపోయింది. ఇరువైపులా మేటలు వేసి, పిచ్చి మొక్కలు, తూడు, గుర్రపు డెక్క పెరిగిపోయాయి. ఫలితంగా 15 మీటర్ల వెడల్పున ఉండాల్సిన కాలువ, ఎనిమిది మీటర్లకు తగ్గిపోయింది. కోరంగి కాలువ కింద రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని కాజులూరు, రామచంద్రపురం మండలంలోని గ్రామాలతో పాటు, కరప, తాళ్లరేవు మండలాల్లో సుమారు 32 వేల ఎకరాల్లో ఆయకట్టు సాగవుతుంది. కాలువ కుచించుకుపోవడంతో ఆయా భూములకు తరచూ సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోరంగి కాలువ వెల్ల లాకుల నుంచి మంజేరు వరకు ప్రవహించి, అక్కడ రెండు భాగాలుగా విడిపోయి, ఓ భాగం మంజేరు శివార్లలో కోరంగి డ్రెయిన్‌లోనికి మరో భాగం శలపాక, తణుకువాడల మీదుగా ప్రవహించి గొర్రిపూడి వద్ద తుల్య భాగ డ్రెయిన్‌లో కలుస్తుంది. ఈ కాలువకు అనుసంధానంగా ఇరువైపులా సుమారు వంద పిల్ల కాలువలు ఉన్నాయి.

ఆధునికీకరణకు నోచుకోక..

ఈ కాలువను 2009 మే నెలలో అప్పటి ప్రభుత్వం ఆధునీకరించింది. దాదాపు రూ.30 లక్షలు వెచ్చించి కోరంగి కాలువలో పొక్లెయిన్‌తో పూడికలు తొలగించి వెడల్పు చేశారు. ఆ విధంగా తీసిన మట్టిని కాంట్రాక్టర్ కాలువ గట్లపైనే వేయడంతో, కొద్ది రోజుల తరువాత ఆ మట్టి కరిగిపోయి మళ్లీ కాలువలోకే చేరింది. దీంతో కాలువ పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు ఈ కాలువ ఆధునీకరణకు నోచుకోలేదు. ప్రస్తుతం కాలువలకు ఇరువైపులా మట్టిమేటలు వేసింది. దీంతో కాలువ సగ భాగం మూసుకుపోయింది. ఉన్న కాలువలో తూడు, గుర్రపు డెక్క పెరిగి, నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. దీనివల్ల ఆయకట్టు భూములకు సక్రమంగా నీరు అందట్లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొలాలకు నీరందక..

ప్రస్తుతం మండల గ్రామాల్లోని వరి పొలాలు నాట్లు, నారుమడుల దశల్లో ఉన్నాయి. ఈ దశలోనే పొలాలకు సాగునీరు ఎక్కువగా అవసరమవుతుందని, కాలువ మూసుకుపోయిన కారణంగా పొలాలకు సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. గత వేసవిలో క్లోజర్ పనుల్లో భాగంగా కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తొలగిస్తారని ఆశించినా తమకు నిరాశే ఎదురైందని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి కోరంగి కెనాల్‌లో సాగునీటి ప్రవహానికి ఆటంకాలు లేకుండా యుద్ధ ప్రాతిపదికన పూడిక తొలగింపు పనులు చేపట్టాలని, లేకుంటే భవిష్యత్తులో మొత్తం కాలువ మూసుకుపోయి పొలాలకు నీరందక.. బీడువారే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు.

శివారు భూములకు నీరందడం లేదు



ప్రధాన కాలువ కోరంగి కెనాల్‌లో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోవటంతో కాలువ శివారు భూముల్లో పొలాలకు సాగునీరు అందటం లేదు. కొంగోడు చానల్‌కు అడపాదడపా వచ్చే సాగునీటి కాలువ ఎగువ రైతులు వినియోగించుకోవటంతో శివారు భూముల్లో ఉన్న గొల్లపాలెం పొలాలు తడారిపోతున్నాయి.

– టేకుమూడి దుర్గారావు, రైతు, గొల్లపాలెం

కెనాల్ ఆధునీకరణ పనులు చేపట్టాలి



కొన్నేళ్లుగా కోరంగి కెనాల్ ఆధునీకరణకు నోచుకోకపోవటంతో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కాలువ క్రమేపి మూసుకుపోయి శివారు భూములకు సాగునీరు చేరటం లేదు. సాధ్యమైనంత త్వరలో అధికారులు కోరంగి కెనాల్‌కు ఆధునీకరణ పనులు చేపట్టాలి.

–నురుకుర్తి శ్రీనివాసరావు, రైతు, టి.మామిడాడ

గణేశ్ ఉత్సవాలకు శ్రీకారం



అంగర చప్పిడిపాలెంలో రాట ముహూర్త పూజ చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామం చప్పిడిపాలెం సెంటర్‌లోని ఆది గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహణ నేపథ్యంలో శనివారం చలువ పందిరి రాట ముహూర్త పూజలు చేశారు. ఉత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన భక్తులు సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పెద్దింశెట్టి సూర్యచంద్రరావు, మేడేపల్లి కొండ, చీకట్ల గంగరాజు, పసలపూడి కృష్ణ, కొండిపూడి శ్రీరాములు, పడాల రాంబాబు, రామకృష్ణ, పెద్దింశెట్టి వీరబాబు, యర్రా వీరన్నబాబు పాల్గొన్నారు.

వ్యవసాయంలో నారుమడుల దశ కీలకం

కాజులూరు: వ్యవసాయంలో నారుమడుల దశ కీలకమైనదని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని చేదువాడ, బందనపూడి తదితర గ్రామాలలో శనివారం వ్యవసాయాధికారి అశోక్ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చేదువాడలో ఆయన మాట్లాడుతూ నారు ఆరోగ్యంగా ఉంటేనే పంట బలంగా పెరుగుతుందన్నారు. వరి సాగులో అనవసరపు వ్యయాలను తగ్గించి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కూటమి పాలనలో కొండెక్కిన ప్రజా సంక్షేమం



ఓదూరులో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమాన్ని కొండెక్కించారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. మండలంలోని బాపనయ్యచెరువు, ఓదూరు, నరసాపురపుపేట గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి చంద్రబాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. బాపనయ్యచెరువు సర్పంచ్ పిల్లి సూర్యప్రకాశరావు, ఆయా గ్రామాల నాయకులు రొక్కాల యేసేపు, కొప్పిశెట్టి ఏడుకొండలు, వాసంశెట్టి తాతారావు, రెడ్డి అనిల్, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మి, మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు పోలినాటి వరప్రసాద్ తదితరులు వెంట రాగా సూర్యప్రకాశ్ ఆయా గ్రామాల ప్రజలను కలసి కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న మోసపూరిత వైఖరిని వివరించారు. చంద్రబాబు మేనిఫెస్టోను చూపిస్తూ ఎన్నికల హామీలను ఎందుకు అమలు చేయడం లేదంటూ కూటమి నాయకులను ప్రజలు నిలదీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, పార్టీ నాయకులు పంపన సుబ్బారావు, పంపన సత్యానందం, బత్తుల అప్పారావు, గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, జగజ్జీవన్‌రావు, జానకిరామయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోదరభావానికి ప్రతీక రక్షాబంధన్



పడమర ఖండ్రికలో సోదరుడికి రాఖీ కడుతున్న బాలిక



రాయవరంలో సోదరుడికి రాఖీ కట్టి హెల్మెట్ అందిస్తున్న సోదరి



గొల్లపాలెంలో తమ సోదరులకు రాఖీలు కడుతున్న బాలికలు

రాయవరం: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయ, అనురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని శనివారం మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇల్లూ ఆత్మీయ అనుబంధాలకు..సంబరాలకు వేదికగా మారింది. మండలంలో ఉదయం నుంచి ప్రతి ఇంటా రాఖీ పౌర్ణమి సందడి కనిపించింది. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టారు.

ఇంటింటా రాఖీ వేడుకలు

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలోని గ్రామాల్లో శనివారం రాఖీ పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరాం, రాయి వీర్రాజు, ఛాత్రాది రాంబాబు, టి.సూర్యనారాయణ, నాళం ఫణి ప్రకాష్ తదితరులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, తదితర ప్రజాప్రతినిధులకు రాఖీ కట్టారు. మండపేట పట్టణం, రూరల్ గ్రామాలైన ద్వారపూడి, తాపేశ్వరం, కేశవరం, పాలతోడు, వెలగతోడు, మెర్నిపాడు, వేములపల్లి, మారేడుబాక, ఏడిద, ఇప్పనపపాడు, చినద్వారపూడి, జెడ్ మేడపాడులో అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండగను జరుపుకున్నారు. కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, వడ్లమూరు, నల్లూరు, కాలేరు, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంకలో సోదరీమణుల చేతి వంటను రుచి చూసిన సోదరులు ఆత్మీయతను పొందారు. తోబుట్టువులకు కానుకలను అందజేసి ప్రేమను పంచుకున్నారు.

రాఖీ పౌర్ణమి సందడి

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాఖీ పౌర్ణమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శ్రావణపౌర్ణమి రోజున తమ సోదరుల క్షేమాన్ని, ఉన్నతిని కోరుతూ ఆత్మీయఅనురాగాలు పంచుతూ తోబుట్టువులు రాఖీ కట్టడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామాల్లోని చిన్నారులు, యువకులు, పెద్దలు వారి అక్కచెల్లెమ్మలతో రాఖీలు కటించుకుని వారికి బహుమతులు అందజేశారు. శ్రావణపౌర్ణమి రోజును హిందువులు జంధ్యాల పౌర్ణమిగా కూడా పిలుస్తారు. ఇందులో భాగంగా యజ్ఞోపవీతం ధరించువారు శనివారం పాత వాటిని తొలగించి కొత్తవి ధరించారు.

ఉత్సాహంగా రక్షాబంధన్

రామచంద్రపురం: ప్రజా జీవితంలో వేసే ప్రతి అడుగుల్లో ఆడపడుచులకు అన్నగా.. అండగా నిలిచి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలోని రాజగోపాల్ థియేటర్ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల సమక్షంలో కేకు కట్ చేసి ఆడపడుచులందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు మంత్రి సుభాష్‌కు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా నాయకులు జాస్తి విజయలక్ష్మి, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వయిట్ల గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు



భీమేశ్వరాలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శనివారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయాలతో పవిత్రోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కుచ్ఛ త్రయం, పంచగవ్య ప్రాసన, మండపారాధనలు, గణపతి హోమం, నారాయణ హోమం, పంచాయతన హోమం, చండీ, రుద్ర హోమాలు నిర్వహించారు. స్వామి వార్లకు శాంతి కల్యాణం, మాణిక్యాంబ అమ్మవారికి శ్రీచక్ర నవావర్ణార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం

రామచంద్రపురం రూరల్: సినీ హీరో మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. ద్రాక్షారామ మార్కెట్ యార్డులో రోటరీ క్లబ్, మహేష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహేష్‌బాబు పుట్టిన రోజును పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం, మహిళలకు కట్టు మిషన్లు, యువకులకు, చిన్నారులకు క్రీడా సామగ్రి, క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. వీధి వ్యాపారులకు గొడుగులు, మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ కిట్లు పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలు మహేష్‌బాబు అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ సురభి శారద, రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు తాడాల బుజ్జి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ద్రాక్షారామ ఏపీసీఎస్ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, నాయకులు కర్రా నాగేశ్వరరావు(తాతీలు), ఆళ్ల బుజ్జి, అరిగెల బాబీ, సలాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరుపుల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



మారేడుబాక పరుపుల ఫ్యాక్టరీలో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కపిలేశ్వరపురం (మండపేట): మారేడుబాకలోని శ్రీలలితాదేవి ఇండస్ట్రీస్ పరుపుల ఫ్యాక్టరీలో శనివారం సాయంత్రం నాలుగున్నర సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసి పడటంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న శ్రామికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయానికి పనిచేస్తున్న ఏడుగురు సిబ్బంది ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎం.వెంకట్రావు ఆధ్వర్యంలోని మండపేట అగ్నిమాపక దళ సిబ్బంది, ఐబీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోని రామచంద్రపురం అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదానికిగల కారణాలు తెలియరాలేదు. నష్టాన్ని అంచనా వేయాల్సి ఉందని ఫైర్ అధికారులు తెలిపారు.

ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం (మండపేట): ద్వారపూడిలోని పలు ఆలయాల ట్రస్టుబోర్డు సభ్యులుగా పలువురు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారు ఆలయం చైర్మన్‌గా పోకల నానాజీ (పుట్టయ్య), మరో 8 మంది సభ్యులు బాధ్యతలు చేపట్టారు. రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా నక్కా శ్రీనివాసరావు, మరో 8మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బంగారమ్మవారు ఆలయం కమిటీ చైర్మన్‌గా రంబాల చక్రరావు, 8 మంది సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉండమట్ల రాజేష్, నాయకులు చింతా దొరబాబు, యరగతపు బాబ్జి, సలాది సుబ్రహ్మణ్యం, సత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ, గోపాలస్వామివారి శ్రవణానక్షత్ర మాస కళ్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఆధ్యాత్మిక వ్యాఖ్యానం నడుమ శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించారు. దేవస్థానం తరపున ఈఓ రమణమూర్తి, పలువురు భక్తులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ర్యాలి పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. తదుపరి మాస కళ్యాణం వచ్చే నెల 5న జరుగుతుందని ఈఓ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంతోషిమాతకు పూజలు

కొత్తపేట: మండల పరిధిలోని వాడపాలెం గ్రామంలో వేంచేసియున్న సంతోషిమాత అమ్మవారి పుట్టిన రోజు పురస్కరించుకుని శనివారం భక్తులు ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బండారు లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు నిట్టల శివరామకృష్ణ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తురాలు గవర లక్ష్మి సంతోషిమాత నోము ఆచరించి, మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు వస్త్రాలు సమర్పించారు.

సచివాలయ భవనాల ప్రారంభోత్సవం



ఇప్పనపాడులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): ఇప్పనపాడులో సచివాలయ భవనాలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. గ్రామంలో రూ.80.6 లక్షలతో రెండు సచివాలయ భవనాలను నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, ఈఓపీఆర్‌డీ దాసరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, మండల ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు, సర్పంచ్ కుంచే వీరమణి, ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, కుంచె ప్రసాద్, చుండ్రు శ్రీవర ప్రకాష్,, వేగుళ్ల అజయ్ బాబు, నల్లమిల్లి వీర్రెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కూటమి నాయకులు పాల్గొన్నారు,

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఫ్ చెక్కులను శనివారం మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతులు మీదుగా అందజేశారు. నియోజకవర్గంలోని 36 మందికి రూ.20,13,759 విలువైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు.

వాడపల్లి వెంకన్నను దర్శించిన ఎస్పీ



భక్తుల సౌకర్యాలపై అధికారులను ఆరా తీస్తున్న ఎస్పీ కృష్ణారావు

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి క్షేత్రానికి వచ్చే ప్రతీ భక్తుడు సౌకర్యవంతంగా స్వామిని దర్శించుకుని సంతృప్తిగా తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు అధికారులకు సూచించారు. ఆయన శనివారం సాయంత్రం వాడపల్లి క్షేత్రాన్ని సందర్శించారు. దేవస్థానం, పోలీస్ అధికారులతో కలిసి క్షేత్రంలో పర్యటించి స్వామి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు, ప్రదక్షిణలకు ఆటంకం లేకుండా నిర్మించిన ప్లెటైవర్లు, అన్నప్రసాద ప్రాంగణం, తలనీలాలు, గోదావరి స్నానఘట్టం, పార్కింగ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా అధికారులు తీసుకుంటున్న చర్యల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈఓ చక్రధరరావు ఎస్పీని స్వామివారి పట్టు వస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని అందచేశారు. ఆయన వెంట కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆత్రేయపురం, ఆలమూరు ఎస్సైలు రాము, నరేష్ ఉన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ హయగ్రీవ జయంతి



స్వామి పాదాల చెంతన ఉంచిన పెన్నులు

మామిడికుదురు: మామిడికుదురు శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ హయగ్రీవ జయంతిని శనివారం వైభవంగా జరిపించారు. బ్రహ్మ శ్రీ సుదర్శనం వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలను ఘనంగా జరిపించారు. 10 వేల పెన్నులతో ప్రత్యేక పూజ నిర్వహించి పూజ అనంతరం పెన్నులను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమం ఆద్యంతం వైభవంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.